క్లుప్తంగా

ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



మాట్లాడుతున్న నాగభూషణరావు

కోటబొమ్మాళి: రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేసేలా మండలంలోని 38 పంచాయతీల్లో 844 మంది గృహసారథులను సన్నద్ధం చేస్తున్నామని సచివాలయాల మండల కన్వీనర్ గెడ్డవలస నాగభూషణరావు చెప్పారు. కమలనాభపురం గ్రామంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రామాయణంలో రాముడికి సహాయంగా వానర సైన్యం శక్తి వంచనలేకుండా పనిచేసినట్లు..తామంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్‌సీపీ విజయం కోసం శ్రమిస్తామన్నారు. ఇందులో భాగంగా ఇప్పటినుంచే ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరిస్తామన్నారు.

బారువ కొత్తూరులో నేత్ర వైద్యశిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

సోంపేట: జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో సోంపేట ఆరోగ్యవరం కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో బారువ కొత్తూరు గ్రామంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని నిర్వహించారు. పది మందికి కంటి అద్దాలు, పది మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వైద్యసహాయకులు ఉగ్రసేన్, ఉప సర్పంచ్ రాజు పాల్గొన్నారు.

సీపీఐ ఎంఎల్ జాతీయసభను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న మల్లేశ్వరరావు

కాశీబుగ్గ: సీపీఐ ఎంఎల్ 11వ జాతీయ మహాసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు మద్దిల మల్లేశ్వరరావు అన్నారు. ఈనెల 15వ తేదీన బీహార్ రాష్ట్రం పాట్నాలో జరగనున్న మహాసభలు విజయవంతం చేయాలని కోరుతూ పలాస, మందస మండలాల్లో ఆదివారం ప్రచారం చేపట్టారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించడం కోసం దేశాన్ని రక్షించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తామాడ సన్యాసిరావు, మద్దిల రామారావు, దుష్యంత్, నాగేశ్వరరావు, శ్రీను, కైలాష్, అప్పయ్య, పాపయ్య పాల్గొన్నారు.

మందసలో గృహ సారథుల ఎంపిక



గృహ సారథులను ఎంపిక చేస్తున్న నాయకులు

మందస: మేజరు పంచాయతీ మందసలో సర్పంచ్ చెరుకుపల్లి యల్లమ్మ, లక్ష్మణమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు కంచి బెహరా ఆధ్వర్యంలో ఆదివారం గృహ సారథుల ఎంపిక ప్రక్రియ జరిగింది. మందస పంచాయతీలో మూడు సచివాలయాలుండగా 47 మంది వలంటీర్లు పని చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ఆదేశాల మేరకు 94 మంది గృహ సారథులను ఎంపిక చేసినట్టు నాయకుడు సీహెచ్ లక్ష్మణమూర్తి చెప్పారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు బరాటం జయప్రకాశ్, సచివాలయం-3 కన్వీనర్ గయా సంతోష్, వలంటీర్లు పాల్గొన్నారు.

సూదికొండలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 19వవార్డు పరిధి సూదికొండలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. అధికమంది జీడి కార్మికులు ఉన్నటువంటి సూదికొండ ప్రాంతంలో విద్యుత్ సమస్యలు తలెత్తుతుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు దృష్టికి కౌన్సిలర్ శిష్టు బృందావతి తీసుకెళ్లారు. మంత్రి ఆదేశాల మేరకు లైన్ ఇన్‌స్పెక్టర్ గార రాజారావు, వార్డు ఇన్‌చార్జి శిష్టు గోపి, లైన్‌మన్ సూర్యనారాయణ, జేఎల్ఎం త్రినాథరావులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆదివారం ఏర్పాటు చేశారు.



ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

బ్రహ్మోత్సవాలకు భక్తుల తాకిడి

- మూడోరోజు దేవతాహ్వానం పలికిన వేద పండితులు
- ఘనంగా అగ్ని ప్రతిష్టామహోత్సవం



భక్తులకు దర్శనమిస్తున్న వాసుదేవుడు



శ్రీదేవి, భూదేవిలతో ఊరేగుతున్న శ్రీవాసుదేవపెరుమాళుడు

మందస: మందసలోని వాసుదేవపెరుమాళుని బ్రహ్మోత్సవాలకు భక్తుల తాకిడి పెరిగింది. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు, ఆధ్యాత్మికవేత్తలు తరలివస్తున్నారు. సాయంత్రం నాలుగు నుంచి రాత్రి 11 గంటల వరకు వాసుదేవుని ఆలయం పరిసరాలు భక్తులతో రద్దీగా మారుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రధాన అర్చకులు, వేదపండితులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు ఆధ్వర్యంలో పవనస్వామి, సచ్చిదానందపాఢి, అనిల్‌కుమార్‌స్వామి, ఘనశ్యాం, వేదపండితులు, అర్చకులు దేవతాహ్వానం పలికారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య భక్తుల వాసుదేవా.. గోవిందా నామస్మరణలతో ధ్వజారోహణం చేశారు. బ్రహ్మోత్సవాలకు దేవతలకు ఆహ్వానం పలికినట్లు అవుతుందని అర్చకులు వివరించారు. విశేష గరుడపూజ అనంతరం సంతానార్థులకు గరుడప్రసాద వితరణ జరిగింది. అగ్ని ప్రతిష్ఠను సంప్రదాయబద్ధంగా చేశారు. వాసుదేవుని ప్రత్యేక అలంకృతునికావించారు. భక్తులు స్వామిని దర్శించుకుని, భక్తి, తన్మయత్వం పొందారు. తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు అన్నదానం కల్పించారు. మూడవ రోజుల కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఉదయం ఐదు నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, సాయంత్రం ఐదు నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు సుప్రభాతసేవ, ప్రాతఃకాలారాధన, నివేదన, గోష్ఠి, యాగశాలలో ద్వారతోరణ, ధ్వజకుంభారాధన, వేద విన్నపములు, చతుఃస్థానార్చన, విశేష హోమములు, పంచసూక్త, పరివార, ప్రాయశ్చిత్త హోమములు, నివేదన, నిత్యపూర్ణాహుతి, బలిహారణ, శాత్తుముర్రై, శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్రపారాయణం, ప్రసాదగోష్ఠి జరిగాయి. ఉదయం తొమ్మిది గంటలకు యాగశాలలో అగ్నిప్రతిష్ట, హోమాలు, పారాయణలు చేశారు. 11 గంటలకు హనుమద్వాహనసేవ, శ్రీరామపూజ, సాయంత్రం ఆరు గంటలకు విష్ణుసహస్రనామ పారాయణం, సేవాకాలం, తీర్థగోష్ఠి, మందస పురవీధుల్లో శేషవాహనసేవ జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన సంగీత విభావరి, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.



అగ్నిప్రతిష్ఠను చేస్తున్న వేదపండితులు

ఉత్సాహంగా 5కే రన్



విజేతలకు బహుమతి అందజేస్తున్న ఎస్‌జీఎఫ్ సభ్యులు

కవిటి: ఉద్దానం ప్రజలు, అభాగ్యుల సేవే పరమావధిగా నడుస్తున్న స్పెషల్ గయ్స్‌ఫౌండేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఆదివారం కవిటిలో 5 కే రన్ ఉత్సాహంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పెద్దసంఖ్యలో యువకులు తమ శారీరక దారుడ్యాన్ని పరీక్షించే క్రమంలో పరుగులో పాల్గొన్నారు. మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన విజేతలకు బహుమతుల్ని సంస్థ బాధ్యులు అందించారు. సంస్థ ఆవిర్భావం నుంచి చేపడుతున్న సేవా కార్యక్రమాలే ఇతివృత్తంగా నిర్మించిన ఎస్‌జీఎఫ్ సినిమా విడుదల సందర్భంగా కవిటి మహలక్ష్మి థియేటర్‌లో ప్రేక్షకులకు ఉచితంగా ప్రదర్శించారు. మూడు షోలలో పెద్దసంఖ్యలో ప్రజలు ఈ సినిమా చూసి సంస్థ సభ్యుల్ని ప్రశంసించారు. అనంతరం సంస్థలో ఉత్తమ సేవలు అందించిన పలువుర్ని సత్కరించారు.

విప్లవ గీతాలతో దద్దరిల్లిన బొడ్డపాడు



పాట పాడుతున్న విమలక్క

పలాస: బొడ్డపాడు గ్రామం ఆదివారం విప్లవ గీతాలతో దద్దరిల్లింది. బొడ్డపాడు యువజన సంఘం 69వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అరుణోదయ గాయకురాలు విమలక్క తన ఆటపాటలతో శ్రీకాకుళ విప్లవోద్యమాన్ని, బొడ్డపాడు అమరవీరుల త్యాగాలను కీర్తించారు. అలాగే ఉద్దానం సాహితీ సాంస్కృతిక సమాఖ్య గాయకుడు కుత్తుం వినోద్ శ్రీకాకుళ వీర వనితలు జయక్క, చంద్రక్కల కోసం పాడి నాటి జ్ఞాపకాలను గుర్తు చేశారు. బాహాడపల్లి, మాకన్నపల్లి, బొడ్డపాడు, పల్లిసారిధి తదితర గ్రామాల నుంచి వచ్చిన జానపద కళాకారులు వివిధ నృత్యాలతో అలరింప చేశారు. కార్యక్రమంలో యువజన సంఘం కార్యవర్గం సభ్యులు గుజ్జు దశరథరావు, తామాడ గంగయ్య, బొడ్డు యుగంధర్, కిక్కర ఢిల్లీరావు, గేదెల జానకీరావు, తామాడ క్రాంతి పాల్గొన్నారు.

కూచిపూడి నృత్యకారులకు సర్టిఫికెట్ల ప్రదానం



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన శ్రీవెంకటేశ్వర డాన్స్ అకాడమికి చెందిన చిన్నారులు కూచిపూడి డిప్లమో సర్టిఫికేట్ కోర్సులో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని అధ్యక్షుడు చిన్నాగురుస్వామి ఆదివారం తెలిపారు. ఈ మేరకు నాట్య గురువు శృతి పట్నాయక్, ఎస్‌కే పూజ, జాగృతి, జాహ్నవిలకు కూచిపూడి నాట్యగురువు ఏలేశ్వరం శ్రీనివాసులు అకాడమి వద్ద ఆదివారం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. చిన్నారులకు అకాడమి ప్రతినిధి జయలక్ష్మి అభినందనలు తెలియజేశారు.

సమన్వయంతో పని చేయాలి



మాట్లాడుతున్న మున్సిపల్ నాయకులు

కాశీబుగ్గ: పార్టీలో అందరూ సమన్వయంతో పని చేయాలని పలాస-కాశీబుగ్గ వైఎస్సార్‌సీపీ నాయకులు సూచించారు. వారు ఆదివారం పలాస మంత్రి క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు, రీజినల్ అధ్యక్షుల దృష్టికి తీసుకెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, ఏఎంసీ చైర్మన్ పీవీ సతీష్, సీహెచ్‌సీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్, వైస్ చైర్మన్లు మీసాల సురేష్‌బాబు, ప్రభుత్వ విప్ శంకర్ పండా, మాజీ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు, కౌన్సిలర్లు, నాయకులు శిష్టు గోపి, బెల్లాల శ్రీను, బల్ల శ్రీను, దున్న సత్యం, బడగల బళ్లయ్య, సవర సోమేష్, మార్పు యుగంధర్, గూన మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలని మంత్రికి వినతి



మంత్రి అప్పలరాజుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాల ఏర్పాటు కోసం పలాసలోని ముత్యాలమ్మ కోనేరు పార్కు వద్ద స్థలం కేటాయించాలని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును జాతిరత్నాలు గ్రూపు సభ్యులు కోరారు. ఈ మేరకు ఆదివారం పలాసలోని క్యాంపు కార్యాలయం వద్ద మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు.

వాకింగ్, సేవా సంస్థలు కలిసికట్టుగా కార్యక్రమాలు చేపడుతున్నామని.. ఇందుకు సహకరించాలని కోరారు.

సీడీపీవోగా హైమావతి

కోటబొమ్మాళి: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం సీడీపీవోగా చింతాడ హైమావతి నియమితులయ్యారు. ఈ మేరకు పీడీ అనంతలక్ష్మి శనివారం ఉత్తర్వులు జారీచేశారు. హైమావతి ప్రస్తుతం సారవకోట ఏసీడీపీవోగా పని చేస్తూ పదోన్నతిపై కోటబొమ్మాళి సీడీపీవోగా నియమితులయ్యారు. ప్రస్తుతం ఇన్‌చార్జి సీడీపీవోగా గ్రేడ్-1 సూపర్‌వైజర్ వై.లావణ్య కొనసాగుతున్నారు. కాగా హైమావతి సోమవారం బాధ్యతలు చేపట్టనున్నారు.

మార్కెట్‌లోకి కర్బుజా పండ్లు



ఎం.తోటూరు రైల్వే క్రాసింగ్ వద్ద అమ్మకానికి సిద్ధంగా ఉన్న కర్బుజా పండ్లు

ఇచ్ఛాపురం రూరల్: వేసవి ప్రారంభానికి ముందే కర్బుజాపండ్లు మార్కెట్‌లోకి వచ్చాయి. రాజమండ్రి, విజయవాడ, గుంటూరు ప్రాంతాలకు చెందిన వ్యాపారులు నియోజకవర్గంలోని ప్రముఖ కూడళ్లలో టెంట్లు ఏర్పాటు చేసుకొని కర్బుజా పండ్లను అమ్మకం చేస్తున్నారు. కేజీ పండు రూ.20 నుంచి రూ.25 వరకు ధర పలుకుతోంది.

బ్రహ్మకుమారీల ఊరేగింపు



ఊరేగింపుగా వెళ్తున్న బ్రహ్మకుమారీలు

ఇచ్ఛాపురం: మహాశివరాత్రిని పురస్కరించుకుని బ్రహ్మకుమారి ప్రజాపిత ఈశ్వరయ్య విశ్వవిద్యాలయం ఓం శాంతి ఆధ్వర్యంలో ఇచ్ఛాపురం పట్టణంలోని సురంగి రాజావారి క్రీడామైదానంలో ద్వాదశ జ్యోతిర్లింగాలను ఏర్పాటు చేయనున్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని ప్రధాన వీధుల గుండా పూర్ణకుంభాలతో ఆదివారం ఊరేగింపుగా వెళ్లి రాజావారి క్రీడా మైదానం వద్దకు చేరుకున్నారు. సాయంత్రం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

నూతన విద్యా విధానంపై అవగాహన



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు

పాతపట్నం: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన విద్యావిధానం బాగుందని పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్షుడు భీమసేన్ పండా అన్నారు. స్థానిక అమ్మవారి ఆలయం సమీపంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండలంలో పీఆర్‌టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉపాధ్యాయులకు నూతన విద్యా విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం రెండు డీఏలను విడుదల చేయాలన్నారు. పీఆర్సీ బకాయిలను చెల్లించాలన్నారు. అవార్డులు పొందిన, బదిలీపై వెళ్లిన పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. గౌరవ అధ్యక్షుడు రెగెటి మధుసూదనరావు, మండల ప్రధాన కార్యదర్శి లూకలాపు గోవిందరావు, అమర జనార్దనరావు, వట్టి భాస్కరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

36 మద్యం బాటిళ్ల స్వాధీనం



పాతపట్నం: మండలంలోని బూరగాం గ్రామం వద్ద పోలీసులు తనిఖీల్లో 36 ఒడిశా మద్యం బాటిళ్లను ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. బూరగాం గ్రామానికి చెందిన కొరాడ కృష్ణ వద్ద ఒడిశా మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎస్.కామేశ్వరరావు తెలిపారు.

డ్రగ్స్ బారిన పడకుండా అవగాహన



టెక్కలిలోని అంబేద్కర్ జంక్షన్ సమీపంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

టెక్కలి: యువత డ్రగ్స్ బారిన పడకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా అవగాహన కల్పించేందుకు విస్తృతంగా ప్రచారం చేస్తోంది. ఇందులో భాగంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో నేతృత్వంలో కళాశాలలు, బహిరంగ ప్రదేశాల్లో అవగాహన ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. యువతా మేలుకో..భవితను మలచుకో, డ్రగ్స్‌ను వదులుకో.. డ్రగ్స్‌కు బానిస కావద్దు, కన్నవాళ్లకు కడుపుకోతను మిగల్చవద్దు, డ్రగ్స్ రహిత సమాజం.. సంక్షేమానికి సంకేతం అనే నినాదాలతో అవగాహన చేస్తున్నారు. అంతే కాకుండా డ్రగ్స్ వినియోగం, డ్రగ్స్ కలిగి ఉండడం, డ్రగ్స్ సంబంధిత నేరాలకు పాల్పడడం వంటి వాటికి ప్రభుత్వం విధించే శిక్షలను సైతం ఈ పోస్టర్ల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. ఎక్కడైనా డ్రగ్స్ ఉంటే తక్షణమే పోలీసులకు సమాచారం ఇచ్చే విధంగా 14500 టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులో ఉంచారు. టెక్కలిలో పలు విద్యా సంస్థలతో పాటు ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన ఈ ఫ్లెక్సీలు డ్రగ్స్ రహితంగా అవగాహన కల్పిస్తున్నాయి.

అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఔదార్యం



మోహనరావుకు సాయం అందజేస్తున్న సర్పంచ్ ప్రకాష్ తదితరులు

కవిటి: బిగొనపపుట్టుగ గ్రామానికి చెందిన మల్లార్పు మోహనరావు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న అబ్దుల్‌కలాం ఫౌండేషన్ సభ్యులు ఆర్థిక సాయం చేసేందుకు ముందుకొచ్చారు. స్థానిక సర్పంచ్ బద్రి ప్రకాష్ నేతృత్వంలో ఆదివారం మోహనరావు ఇంటికి వెళ్లి పది వేల రూపాయల సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రకాష్ మాట్లాడుతూ.. కలాం ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు నర్తు సోమేశ్వరరావు, బిజోత్స్న, జి.జానకీరావు, బి.భాస్కరరావు, నర్తు సోంబాబు, గ్రామపెద్దలు పూడి రామారావు, బి.లోకనాథంపాల్గొన్నారు.

ఘనంగా తులసమ్మ సంబరం



గజముద్దతో అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం



ప్రతిష్ఠించిన ఆంజనేయ స్వామి విగ్రహం

ఇచ్ఛాపురం రూరల్: లొద్దపుట్టిలో పూజలందుకుంటున్న ధనరాజుల తులసమ్మ తల్లి సంబరం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ధర్మపురం, తులసిగాం, బలరాంపురం, హరిపురం గ్రామాలతో పాటు ఒడిశాకు చెందిన సుమండీ, జయంతిపురం, సుర్లా నుంచి భక్తులు అమ్మవారిని మేళతాళాలు మధ్య ఘనంగా ఊరేగించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ

ఇచ్ఛాపురం: పట్టణంలోని గొల్లవీధి, చక్రపాణివీధి కూడలి కోర్టు వద్ద అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహదాత సాలిన లోకనాథం దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



చలం మాస్టారును సత్కరిస్తున్న దృశ్యం

పలాస: గోపాలపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా పనిచేసి వజ్రపుకొత్తూరు మండలం కొండవూరు పాఠశాలకు ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంటుగా బదిలీపై వెళ్లిన ఎల్.వి.చలం మాస్టారును గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆదివారం ఘనంగా సత్కరించారు. పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ పైల ధాత్రి అధ్యక్షతన జరిగిన సన్మాన సభలో పలువురు వక్తలు ప్రసంగిస్తూ చలం పనిచేసిన రెండేళ్లలో విద్యాభివృద్ధితో పాటు పాఠశాల అభివృద్ధికి చేసిన కృషిని ప్రశంసించారు. పూర్వ విద్యార్థుల ఆర్థిక సహకారంతో పాఠశాల పరిసరాలను అభివృద్ధి చేశారని వివరించారు. సన్మాన గ్రహీత చలం మాట్లాడుతూ.. పాఠశాలను విడిచి వెళ్లడానికి బాధగా ఉందన్నారు. ప్రభుత్వం విద్య కోసం అధిక ప్రాధాన్యం ఇస్తోందని.. దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం వి.భారతమ్మ, పేరెంట్స్ కమిటీ సభ్యులు పి.గిరిజ, బి.అశ్విని, వై.లీలాకుమారి, ఆర్.భవాని, పి.ఆదయ్య, ధనలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు వై.ప్రేమ, కాంచన పాల్గొన్నారు.

60 మందితో విద్యుత్‌లైన్ల మరమ్మతులు



మరమ్మతులు చేపడుతున్న విద్యుత్ సిబ్బంది

కోటబొమ్మాళి: స్థానిక 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం 60 మంది సిబ్బందితో అత్యవసర మరమ్మతులు చేపట్టారు. ఏడీ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో పనులు జరిగాయి. గతంలో వేసిన స్తంభాలు, లైన్లు రోడ్డు మధ్యలో ప్రమాదభరితంగా ఉండడం, గాలులకు తీగలు కలిసిపోతూ సరఫరాకు అంతరాయం కలిగేది. దీంతో కొత్తగా స్తంభాలను, లైన్లను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేశారు. వేసవిలో విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఏఈ బి.వి.సురేష్, లైన్ఇన్‌స్పెక్టర్ శ్రీరామచంద్రుడు, లైన్‌మెన్ నారాయణ, జేఎల్ఎంలు శాంతారావు, గోపాల్ పాల్గొన్నారు.

అగ్నికుల క్షత్రియ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇచ్ఛాపురం రూరల్: నియోజకవర్గంలో అగ్నికుల క్షత్రియ సామాజిక సంఘాన్ని బలోపేతం చేసేందుకు అందరూ కృషి చేయాలని కేశుపురం గ్రూప్ అధ్యక్షుడు ఇరోతు వెంకటస్వామి పిలుపునిచ్చారు. కేశుపురంలోని సంఘ భవనం వద్ద అగ్నికుల క్షత్రియ క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. తమ సామాజిక వర్గంలో అట్టడుగున ఉన్నటువంటి వారిని గుర్తించి వారికి సంఘం తరఫున అన్ని విధాలుగా ఆదుకోవాలని, విద్య, ఉద్యోగాల్లో ఉన్నత స్థాయిలో ఉండాలన్నారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి కీలు చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు బుడత శ్యామసుందరం, కోశాధికారి శివంగి భీమారావు, కుల నాయకుళ్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

● విరగకాసిన మామిడి



విరగకాసిన మామిడి చెట్టు

వజ్రపుకొత్తూరు రూరల్: ఉద్దానంలోని కొన్ని ప్రాంతాల్లో ఈ ఏడాది జీడి మామిడి పంట అనుకూలంగా ఉందని రైతులు చెబుతున్నారు. వాస్తవానికి ఫిబ్రవరి మొదటి వారానికి పూత, పిందె దశలో ఉండాలి. అయితే వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో ప్రస్తుతం మామిడి చెట్లు పెద్దపెద్ద కాయలతో దర్శనం ఇస్తున్నాయి.

దోకులపాడు పరిసర తోటల్లో జి.మోహన్‌రావుకి చెందిన మామిడి చెట్లు విరగకాసి కనిపిస్తున్నాయి.